పోలీసులపై కేసుల ఒత్తిడి



- ఫిర్యాదుదారులతో నిత్యం రద్దీగా నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్
- రెండు వారాల సిక్ లీవ్‌లో కొత్త సీఐ
- ఇన్‌ఛార్జిని నియమించని ఉన్నతాధికారులు

సీతమ్మధార : నగరంలోనే ఎంతో కీలకమైన పోలీస్ స్టేషన్లలో ఒకటైన నాలుగో పట్టణ పీఎస్‌లో కొత్త సీఐగా సత్యనారాయణ ఏ ముహూర్తాన బాధ్యతలు స్వీకరించారో గానీ కేసుల మీద కేసులు రావడంతో ఒత్తిడి పెరుగుతోంది. ఒకవైపు బాలికల మిస్సింగ్ కేసులు..., మరోవైపు ఫోక్సో చట్టం కింద కూడా కేసులు నమోదవుతున్నాయి. ఇక్కడ సీఐగా సత్యనారాయణ గత ఏడాది డిసెంబర్ 21న బాధ్యతలు స్వీకరించారు. ఈయన వచ్చినప్పటి నుంచి ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరిగిపోవడం మిగిలిన స్టేషన్లలో కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ఇక్కడ సీఐ పోస్టు భర్తీలో జాప్యం జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ఇక్కడ సీఐగా పోస్టింగ్ వచ్చినా కొందరు విధుల్లో చేరకపోవడం గమనార్హం. పోనీ ఆలస్యంగా అయినా సీఐ పోస్టు భర్తీ అయిందిలే అని సిబ్బంది ఊపిరి పీల్చుకుంటుండగా... ఇంతలోనే ఈ నెల 9 నుంచి రెండు వారాలపాటు సీఐ సిక్ లీవ్ పేరిట సెలవులోకి వెళ్లిపోవడం గమనార్హం. సీఐ అనారోగ్యం కారణంగా సెలవులోకి వెళ్లిపోవడం విచాకరమని సిబ్బంది చెబుతున్నారు. ఇంకా ఆయన స్థానంలో ఎవరినీ ఇన్‌ఛార్జిగా ఉన్నతాధికారులు నియమించలేదు. కేసుల ఒత్తిళ్లు భరించలేకనే సీఐ సత్యనారాయణ అనారోగ్యానికి గురయ్యారని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. పట్టుమని రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే కేసులతో ఉక్కిరిబిక్కిరి అయిన సీఐ ఎట్టకేలకు అనారోగ్యంతో సెలవు పెట్టక తప్పని పరిస్థితి నెలకొంది.

నిత్యం హౌస్‌ఫుల్‌గా పోలీస్ స్టేషన్



నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణ ఉదయం, సాయంత్రం, రాత్రి అన్న తేడా లేకుండా ఎప్పుడు చూసినా హౌస్‌ఫుల్ అన్న చందంగా ఫిర్యాదుదారులతో కిటకిటలాడుతోంది. ఈ స్టేషన్‌లో సీఐ పర్యవేక్షణలో ఐదుగురు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, పది మంది హెడ్ కానిస్టేబుళ్లు, 28 మంది కానిస్టేబుళ్లు, ఏడుగురు హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బాలికల మిస్సింగ్ కేసులతో ఇక్కడ సీఐ సహా ఇతర సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. రైల్వేస్టేషన్, కైలాసపురం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి కేసులు నమోదవుతున్నాయి. రైల్వేస్టేషన్ ఆవరణలో గంజాయి నివారణ కోసం ప్రత్యేక ఔట్‌పోస్టు కూడా ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో గంజాయి స్వాధీనం కేసులు కూడా పెరిగాయి. ఈ స్టేషన్ పరిధిలో ప్రతి నెలా సగటున 20 నుంచి 30 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అంటే నెలకు ఫిర్యాదులు దాదాపుగా 50కి పైమాటే. చిన్నాచితకా కేసులు స్టేషన్ వద్దనే రాజీ చేసి పంపుతుంటారు. గత ఏడాది ఈ స్టేషన్ పరిధిలో 340 వరకు కేసులు నమోదయ్యాయి.

రాత్రివేళ బాలికల విచారణ!

మిస్సింగ్ కేసుల్లో సాక్షులైన బాలికలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన కానిస్టేబుళ్లు వారిని స్టేషన్‌లో రాత్రిపూట విచారించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత నెలలో ఒక బాలిక మిస్సింగ్ కేసుకి సంబంధించి గాజువాకకు చెందిన మరో బాలికను రాత్రి 8 గంటల వరకు స్టేషన్‌లో విచారించారు. అదేమంటే సీఐ చెప్పడం వల్లనే విచారిస్తున్నామని సదరు కానిస్టేబుళ్లు చెప్పడం విశేషం. సీఐ చెప్పినా బాధ్యతాయుతమైన పోస్టులో ఉండి కూడా బాలికలను సాధ్యమైనంత త్వరగా విచారించి ఇంటికి పంపించాలన్న ఇంగిత జ్ఞానం లేకపోవడం దారుణమని బాలిక కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లో రాత్రిపూట పొద్దుపోయే వరకు విచారణ పేరిట బాలికలను అధిక సమయం వేచివుండేలా చేస్తున్నారని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట సీపీ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ నిమిత్తం ఆయా ప్రాంతాల నుంచి రాత్రి 7.30 గంటల తర్వాతనే సీఐ స్టేషన్ ముఖం చూస్తున్నారు. దీంతో బాలికల విచారణకు అధిక సమయం పడుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎందుకు ఆలస్యమైందని ఇళ్లలో తల్లిదండ్రులు అడిగితే ఏం చెప్పాలో తెలియని బాలికలు అయోమయ దుస్థితి ఎదుర్కొంటున్నారని సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌ఛార్జి సీఐని నియమించాలని, ఇతర అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

స్ప్రింట్స్‌లో శైలజకు స్వర్ణం



విజేత శైలజను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ మధుకుమార్, తదితరులు

సీతంపేట : విజయవాడలో ఈ నెల 8, 9న చాంప్స్ స్పోర్ట్స్ అండ్ న్యూట్రిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 18 స్టేట్ అథ్లెటిక్ మీట్‌లో స్ప్రింట్స్ మానియాలో బుల్లయ్య కళాశాల ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని బి.శైలజ అద్భుత ప్రతిభతో స్వర్ణ పతకాలు సాధించింది. 60 మీటర్లు, 200 మీటర్లు, 400 రిలే రేసులో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు సాధించి, బెస్ట్ అథ్లెట్ అవార్డును కూడా గెలుపొందింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థినిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ కె.సోమేశ్వరరెడ్డి, జి.ఎస్.కె.చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.


పాలిటెక్నిక్‌లో నేటి నుంచి ఉచిత శిక్షణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఫార్మాసిస్టులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఫార్మాసిస్టులు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు భారత ప్రభుత్వ లైఫ్ సైన్సెస్‌లోని నైపుణ్యాభివృద్ధి కౌన్సిల్ ఆధ్వర్యంలో "ఫార్మకోవిజిలెన్స్ కేస్ ప్రాసెసింగ్" అనే అంశంపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులకు 40 మంది రిజిస్టర్డ్ ఫార్మాసిస్టులు హాజరవుతారని చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని మంగళవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఏఎస్ఐ/ఆర్పీఎఫ్/సీఐబీ జేటీ నాయుడు సిబ్బందితో మంగళవారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కృష్ణా జిల్లాకు చెందిన పాపగంటి జోషఫ్ వద్ద 6 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

నేడు వైభవునికి పంచామృతాభిషేకం



మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా పంచామృతాభిషేకం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే దాతలు, భక్తులు మంగళధ్వని, వేద మంత్రోచ్చరణ మధ్య ఆలయం చుట్టూ అభిషేక ప్రదక్షిణ చేస్తారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. అనంతరం వైభవుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

సుబ్రహ్మణ్యస్వామికి ఘనంగా పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి పూజ చేస్తున్న రాజు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో మంగళవారం శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో తైపూస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, అర్చన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు

సేవా కార్యక్రమాల విస్తృతికి చర్యలు



వనితా వాకర్స్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు ప్రభావతి

మురళీనగర్ : మురళీనగర్ వనితా వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతికి చర్యలు తీసుకుంటున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి చెప్పారు. ఆమె ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో వనితా వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించనున్న కార్యక్రమాలకు సభ్యులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ నెల 16న బీచ్‌లో నిర్వహించనున్న క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా పింక్ సారీ వాక్‌కు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మార్చి 6న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 21న క్లబ్ కమిటీ సమావేశం, 23న ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్‌సీ – –5 ఉప్పలపాటి శుభ, వనితా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు పి.మహాలక్ష్మి, ఆర్.సుదిత, కార్యదర్శి ఎం.జయ, సంయుక్త కార్యదర్శి జి.శిరీష లత, కోశాధికారి కె.భానుమతి, ఎం.ప్రమీల రావు, సీహెచ్ పద్మావతి, ఎ.మంగాదేవి, కె.వినీల, ఆర్.స్నేహలత, పి.సుభద్ర, ఎం.స్వాతి మాధురి పాల్గొన్నారు.

ఘంటశాలకు ఘన నివాళి



చిట్టిబాబును సత్కరిస్తున్న సభ్యులు, భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గానసుధ, ఘంటసాల గాత్రంతో అలరించే గల్లా చిట్టిబాబు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ధ్యానమందిర నిర్వాహకులు చిట్టిబాబును, బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు అభినందనలు



విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు, తదితరులు

సీతంపేట : ప్రభుత్వ మహిళా ఐటీఐ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విద్యార్థినులు ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా లోక్‌జెట్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శిక్షణ పూర్తి చేసుకుని రూ.3.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారు. వీరిని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.రమణారావు, ట్రైనింగ్ ఆఫీసర్ శంకరరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9 వేల పెన్షన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆప్రా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్

సీతంపేట: ఆల్‌ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్‌ఈనెల 11న ఢిల్లీలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీఆర్‌పీఏ (ఆప్రా)విశాఖ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆప్రా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలుతో పాటు, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దీనబంధు జిల్లా ఉపాధ్యక్షుడు యు.వి.ఎస్.ఎస్.వర్మ, రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు, సెయిల్ నాయకులు ఎ.నారాయణరావు, ఆర్టీసీ నాయకులు తులసీరామ్, కమిటీ సభ్యులు కె.ఎం.కుమార్ మంగళం, పట్నాయక్, రాము, కె.వెంకట రమణారావు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల జీవనం మెరుగుపడాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య రాజు

విశాఖ విద్య : గ్రామీణ భారతంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. ఏయూ రాజనీతి – ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పార్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్' జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పన దిశగా కృషి జరగాలని సూచించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం, స్వేచ్ఛ అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహార లోపం, అనారోగ్యం, మానసిక సమస్యలు వంటివి గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు. వీటిని పరిష్కరించే దిశగా నిపుణులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సదస్సులో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య పి.ప్రేమానందం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్ కుమార్, ప్రొఫెసర్ ఎస్సార్ సుభాని, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హారీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

బీచ్‌రోడ్డు: ఇంటర్నెట్ సేవల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ఓటీపీల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సేఫ్ ఇంటర్నెట్ డే సందర్భంగా మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఆర్థిక నేరాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ గంగాధర్, మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దు



పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ కోరారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 134వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను 300 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రైవేటువారికి అప్పగించాలని చూస్తున్నారని, మా పోరాటంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నారని తెలిపారు. ప్రైవేటీకరణ నిర్ణయం దారుణమని, వెంటనే ఉపసంహరించుకుని, పోర్టు సొంత నిధులతోనే హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, అధ్యక్షుడు జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, మూర్తి, సీహెచ్‌వీఎస్ రెడ్డి, నరసింహ, రాఘవులు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ సేవ



శ్రీలలితాపీఠంలో సహస్ర దీపాలంకరణ సేవలో అమ్మవారు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతంపేట : శ్రీలలితాపీఠం 76వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం లలితా అమ్మవారికి 250 కిలోల అన్నాభిషేకం జరిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం దర్బారుహాల్లో సహస్ర దీపాలంకరణ, సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం లలితా దీక్ష విరమణ, గురుపూజ నిర్వహిస్తామని, సాయంత్రం లలితాకామేశ్వరుల ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

అంధకారంలో రేసపువానిపాలెం



విద్యుత్ లేకపోవడంతో డాబా మీద నిద్రిస్తున్న యువకులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధిలోని పాత రేసపువానిపాలెంలో ప్రజలను విద్యుత్ కష్టాలు వీడడం లేదు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలు లేకపోవడంతో నగరవాసులు హాయిగా జీవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రేసపువానిపాలెంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ కారణంగా ఉక్కపోత భరించలేక పలువురు డాబాల మీద నిద్రించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని చాలా ఇళ్లు ఇరుకుగా వుంటాయి. విద్యుత్ లేకపోతే పిల్లా పాపలతో ఇబ్బంది పడుతూ డాబాలపైకి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయాల నివారణకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై పీఆర్‌సీ బృందం సమీక్ష



డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర పీఆర్‌సీ బృంద సభ్యులు

మహారాణిపేట: ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు ఢిల్లీ నుంచి వచ్చిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్‌సీ) కేంద్ర బృందం విశాఖ చేరుకుంది. ఈ బృందంలో సభ్యులు డాక్టర్ పాదాలు, రమణ 5 రోజులు పాటు విశాఖలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బృంద సభ్యులకు వివరించారు. మధ్యాహ్నం కంచరపాలెం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది హాజరు పరిశీలించి తగు సూచనలు చేశారు. సమావేశానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సు ప్రారంభిస్తున్న జితేంద్ర శర్మ

విశాఖ విద్య: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలని ఏఎంటీజెడ్ ఎండీ జితేంద్ర శర్మ అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలోని ఐఐపీఈలో మంగళవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధునాతన శాస్త్రీయ పరికరాలను కోరుకునే పరిశోధకులు లేదా పరిశ్రమ సభ్యులు తమకు అవసరమైన పరికరాల కోసమని అనువైన సంస్థతో భాగస్వామ్యం కావటం ద్వారా అభివృద్ధి దిశగా ముందుకు సాగవచ్చన్నారు. ఇలాంటి సదస్సులు వివిధ పరిశ్రమల నిర్వాహకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వివిధ నమూనాలను ప్రదర్శించారు. విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ ఎండీ డాక్టర్ లాల్ కృష్ణ, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, డీన్ ఆచార్య విజయ మోహన్, రిజిస్ట్రార్ రాంగోపాల్ ద్వివేది తదితరులు ప్రసంగించారు. సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి అధ్యాపకులు, పరిశోధన స్కాలర్లు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు యువకుల అరెస్ట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ అప్పుఘర్ కూడలి వద్ద చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను ఎంవీపీ కాలనీ నేరవిభాగం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో షేక్ షహీదుల్లా అనే వ్యక్తి అప్పుఘర్ కూడలి దరి టూరిజం హోటల్ పార్కింగ్ వద్ద నిలబడి ఉండగా, అదే ప్రాంతానికి చెందిన పేర్ల రఘు (19), నీలు నవదీప్ అలియాస్ నాని (20) వచ్చి అతనిపై దౌర్జన్యం చేసి, అతని వద్ద నుంచి రూ.2 వేలు నగదు దోచుకొని పరారయ్యారు.

ఈ ఘటనపై షహీదుల్లా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంవీపీ క్రైం ఎస్ఐతో పాటు సిబ్బంది ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి, నేరస్తులను గుర్తించారు. మంగళవారం వారిద్దరినీ అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.